# పునస్వప్నం

గదినిండా చీకటి. గదిబయట వెల్తురు. శరత్కాలం వెన్నెల విచార మెరుగని జీవితం మాస్తరు స్నిగ్ధంగావుంది. యామినీ దేవత నవ్వులులాగా వెన్నెల వెలుగులు అల లలలుగా ఆకాశపు అంచులవరకూ పోయి విరిగి కెరటాల మరుగులులా జలజలా జారుతూవున్నాయి. తెల్లని వుప్పాడ జరీ చీర కట్టుకున్న సుందరిలాగా విరబూచిన విరజాజి సువాసనలు తోటంతా వ్యాపిస్తున్నాయి. మంచుజల్లుకు రెక్కలు తడిసిన పావురాళ్లు లాగా పిల్లగాలులు పల్లటీలు కొడుతున్నాయి. నిశ్శబ్దసుందరమైన ప్రకృతిలో రేగి మూలుగులులాగా దూరాన చర్చిలో కొట్టిన గంటలు మూడూ నీరసంగా వినిపిస్తున్నాయి.

విషాద జీవితంలోకి ప్రవేశించిన ఆనంద రేఖలు అన్నట్లు కిటికీలోనుంచి వచ్చిన వెలుగులు గదిలో చీకటిని చెరిపివేస్తున్నాయి. లేత మబ్బు రంగు డిస్టంపర్ పెయింట్ చేసిన గోడలూ, పాలరాతి పనిచేసిన చప్టా తెల్లని పైటాపూ వొక్కటిటే వెన్నెల చూచి తెల్లబోతున్నాయి. విశాలమైన గది. మైసూరు సోఫా సెట్టు పారసీకపు బొమ్మల వెల్వెట్ కుషన్లు ఏనుగు తల టీపాయి. గదిమధ్య మొహాగనీ పందిర పట్టిమంచం. గోడకానుకొని రోజ్ వుడ్ డ్రెసింగ్ టేబుల్ పైన దంతపుపని చేసిన గడియారం వీటన్నిటితో గది మితాభరణ సుందరిలాగా వుంది.

గడియారం 8వ గంటకు దగ్గరగా వచ్చి ఆగిపోయింది. అది ఏనాటి 8వ గంటో మరి. ప్రక్కనే వున్న కాలెండరు మాత్రం బయటి ప్రపంచానికి పదిహేను రోజులు వెనుకపడివుంది. ఆ గదిలో మాత్రం కాలగమనం పదిహేను రోజుల క్రితమే నిలిచిపోయిన మాట నిజం!

వెన్నెలలు ప్రాకుకుంటూ పోయి దోమతెర దూసుకుని మంచంమీద కెక్కాయి. హంస రెక్కలవంటి మెత్తని పరుపులపైన పాలనురువులా తెల్లని దుప్పటి. పట్టు దిళ్లలో అంతవరకూ యేడ్చి అప్పుడే అరకన్ను మూగన్నుగా వున్నాడు రాజారావు. వెన్నెల వెలుగుల్లో అతని చిక్కిన చెక్కిళ్లమీద తడియారని కన్నీటి చారలు కనిపిస్తూనే వున్నాయి. చల్లని వెన్నెల రేఖలు కన్నులు అతని కన్నుదురు ముద్దుపెట్టుకుంటున్నాయి. కలతనిద్రలో కలలు కంటున్నాడో! కలలో కనిపించిన దేవకన్య కటాక్షించిందో! ఏమో! చిరపరిచితమైన అమృతస్పర్శసుఖం వొకటేదో చక్కిలిగింత పెట్టినట్టు వొళ్లు జలదరించి లేచి కూర్చున్నాడు. ఖాళీ అయిపోయిన మంచం మీది అర్ధభాగం అతణ్ణి వెక్కిరించింది.

*బొడ్డు బాపిరాజు*

పిచ్చివాడిలా లేచి గది తలుపుతీసి తోటలోకి చూచాడు. ఎదురుగా మల్లె పందిర ప్రక్క తెల్లని పైట చెంగు కదలిన ట్లుంది. వెర్రి ఆశతో వెళ్ళాడు. ఏముందక్కడ! పూసిన నైట్ క్వీన్ పూలకొమ్మ తప్పితే. కళ్లనిండా నీళ్లు తిరిగాయి. అక్కడే అరుగుమీద కూలబడిపోయాడు.

ఎదురుగా పాలరాతి తులసికోటలో వనితామణి సాయంత్రం వెలిగించిన దీపం రెకు విప్పని కలువ మొగ్గలాగా నిశ్చలంగా వెలుగుతూ వుంది. దాన్ని చూస్తూవుంటే ఆ లోకపుజీవి పలకరించి వోదారుస్తూ వున్నట్టుంది. గూడుకట్టినగుండెలో చీకట్లను చీలుకుతూవున్నట్టుందా దీపపుశిఖ. ఎన్నో వెనుకటి సంగతులు గుర్తుకొస్తున్నాయి.

అప్పటికి భార్య సరళపోయి పదిహేను రోజులయింది. మనస్సులో పడినగాయం రోజుకురోజుకు సెలవేస్తూవుంది.

—తన 'సరూ' పోయింది. ఇలా జరుగుతుందని యేనాడూ అనుకోలేదు. ప్రాణానికి ప్రాణం ఆమె పోయాక యిన్నాళ్ళూ యెలా బ్రతికగలిగానా? - అనుకుంటున్నాడతను.

అతనిలాటి భగ్నజీవు లెంతమందో జీవితంలో యెదురుదెబ్బలు తిన్నప్పుడల్లా ఇల్లా అనుకుంటూనే బ్రతకగలిగా రన్న మాట అతని కెవరు చెపుతారు.

ఈ యిల్లూ యీ గదీ తోటా తోటలోని ప్రతి తీగా పూవూ అతని ఆనందజీవితంలో వొకనాడు భాగస్వాములు. అనుభవించిన అయిదారు సంవత్సరాలూ అయిదారు రోజులా గడుపుకున్నాడు. ఇప్పు డతని బ్రదుకుబాట కడ్డుగా ముళ్లకంచెలు వేసింది విధి. భార్యపోయిన యీ పదిరోజులూ పది యుగాలకన్నా దీర్ఘంగా వున్నాయి.

అతని జీవితగేయంలో వెనుకటి చరణాలొకటొక్కటే పునరాలాపం చేసుకుంటున్నట్టు గుర్తుకొస్తున్నాయి.

—చాలా చిన్నతనం. తనకు తల్లెవరో తెలియదు. తనను చూచిన ప్రతివారూ జాలిపడేవారు. తండ్రి రెమ్మన పెట్టుకోని పెంచాడు. ఎంతమంచివాడు! ఎన్ని కథలు చెప్పి తను పెట్టే తిప్పలన్నీ పడేవాడు, తనను నిద్రపుచ్చడానికని. ఏదడిగితే అది కొని పెట్టేవాడు ఎంత విసిగించినా వల్లెత్తుమాటనకుండా తల్లీ తండ్రీ తనే అయి పెంచాడు.

—తనకు పదేళ్లుంటాయి. బడినుంచి అప్పుడే వచ్చాడు. చావిట్లో మేనమామా తండ్రీ మాట్లాడుతున్నారు. మా మయ్య నాన్నను పెళ్ళిచేసుకోమని బ్రతిమాలుతూ నచ్చచెపుతున్నాడు. తాను అమాయకంగా కుతూహలంకొద్దీ నాన్నవంక చూశాడు. నాన్న తనను దగ్గరకు తీసుకుని పసిపిల్లడిలా ఏడ్చాడు. తనకూ యేడుపు వచ్చి యేడ్చాడు. వాళ్లమాటలన్నీ తన కప్పుడన గాహన కాకపోయినా తనకోసం తండ్రి తన సుఖాన్ని త్యాగం చేశాడన్నది గుర్తుకు వస్తూ హృదయం పితృభక్తితో నిండిపోయేది.

వాళ్ల వూరినించి బస్తీకివచ్చి కాలేజీలో ప్రవేశించాడు. తనకంతా అదోలా క్రొత్త లోకంగా వుంది. అన్నీ క్రొత్త మొగాలే. ఆదరాభిమానాలు ఏ కళ్లలోను కనిపించవు సరికదా పైపెచ్చు వెక్కిరిస్తున్నాయి. ఒక రెండుకళ్లుమాత్రం మొదటి చూపులోనే తన్ను జాలిగా చూసినట్లనిపించాయి. ఆ కళ్ళకే తన జీవితాన్నంకితం చేస్తానని ఆనాడు వూహించనైనా లేదు.

—నెల తిరగకుండానే చిత్రంగా సరళతో పరిచయం కలిసిం దొక బంధువుల యింట్లో పెళ్లిలో. తాను పెళ్ళికూతురు తరఫునా, సరళ పెళ్లికొడుకువారి తరఫునా బంధువు లయారు. ఆ అయిదురోజులూ తలుపుదగ్గిర పేర్లు వుంది చెప్పించడ,

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆


## కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

రెండు భాగములు

ఒక్కొక్క భాగం

వెల రూ. 3-8-0

పోస్టుఖర్చు ప్రత్యేకం.

## ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు—1.


◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

లోనూ పానుపుమీద జాదాలాడించడంలోనూ దంపతి భోజనాల్లో ఎంగిళ్ళు వేయించడంలోనూ వీళ్లిద్దరిదే అధ్వర్యం అంతా. ఆ పరిచయం ప్రణయంగా మారింది యింటరు పూర్తిఅయ్యే లోగానే.

—తనకు పెళ్లిసంబంధాలు వస్తున్నాయి. లోటెడంత ఆస్తి తనది. వేలమీద కట్నం పెరిగింది. ఒక జమీందారీ సంబంధంలో తండ్రికూడా పట్టుపట్టాడు చేసుకోమని. మనస్సులో మాట సిగ్గుతో చెప్పలేక తండ్రి బుజ్జగింపులతో సరళ సంగతి చెప్పాడు. తన తండ్రి దేవుడిలాటివాడు వాళ్లు కట్నాలూ కానుకలివ్వలేకపోయినా తన కోసం అంగీకరించాడు. పెళ్ళి కెంత అర్భాటం చేశాడు. సరళ సిగ్గుల పెళ్లికూతురై క్రొత్త అందాలొలకపోసిందా అయిదురోజులూ. ఆ కొంటెతనం అంతా ఏమయిపోయిందో కన్నెత్తి చూడడం కూడా కష్టమైపోయింది. కోడల్ని తెచ్చుకున్న ముచ్చటన్నా తీరకుండా యేడాదిలోగానే తండ్రి అనుకోకుండా వొక ప్రొద్దుట గుండెజబ్బువల్ల చనిపోయాడు మంచీ చెడ్డా ఏమీ చెప్పకుండా.

—ఆరోజు బాగా జ్ఞాపకం. తండ్రి పోయాడని తను బెంబేలు పడిపోతున్నాడు. అటు వ్యవసాయం ఇటు వ్యాపారం అన్నీ పులిలాగా సమర్థించుకపోయేవాడు. తనకు తూరుపు పడమరలు సరిగా తెలియవు. రాబందుల్లాగా అయినవారూ కానివారూ వేట జంతువుకు మాటు పెట్టినట్లు తన చుట్టూ వలలు పన్ని కూర్చున్నారు. అవఘ్యాడైన బిడ్డణ్ణి తల్లి వొడిలోకి తీసుకున్నట్టు సరళ తనను చేతుల్లోకి తీసుకుని ధైర్యం చెప్పి ముందుకు నడిపించింది. ఆ ఆసరాతో అయిదారు నెలలకల్లా పగ్గాలన్నీ తన గుప్పెట్లోకి తీసుకుని రథం నడిపించుకోగలిగాడు.

—తండ్రి చావుతో దస్తరంకట్టిన చదువుకు మళ్ళీ బూజు దులిపి పట్నంలో కాపురం పెట్టించి బి.ఎ. వరకూ సాగించాలని సరళ ప్రయత్నించి తన్నెలాగయితేనేం పూర్తికొట్టించింది.

—తనూ 'సరూ' సెలవలు వృథా పోనిచ్చేవారుకారు. అజంతా - ఎల్లోరా - బేలూరు - హాళేబీడు - శ్రావణ బెల్గోలా - హంపీ - శ్రీశైలం - ఓరుగల్లూ - మధుర - తంజావూరు - తిరుచునాపల్లి - కన్యాకుమారి - మహాబలిపురం - కళాలక్ష్మి తన దివ్య స్వరూపంతో కన్నులూ మనసూ తరింపచేసే పవిత్రస్థలాలెన్నో తిరిగి వచ్చారు. తనకు తెలియని కళారహస్యాలెన్నో సరూ విడమర్చి చెపుతూవుంటే తాను విస్తుపోయి వింటూవుండేవాడు. ఆమెతో జీవితం బీచిషికారులాగా, వెన్నెల రాత్రిలాగా విందుభోజనంలాగా హృదయాన్నూగించే సినిమాలాగా చక్కని చిత్రంలాగా కమ్మని కావ్యంలాగా రెక్కారెక్కా రాసుకుంటూ మబ్బుల్లో తేలిపోయే బంగారు పిచ్చుక జంట పాటలాగా సుఖస్వప్నాలతో గడిచిపోయింది.

—రాక్సీలో ఏదో యింగ్లీషు పిక్చర్. రెండవ ఆటకు రమ్మని సరళను బలవంతం చేశాడు. 'రానే'నని తన చుబుకం పట్టుకుని గోముగా ప్రతిమాలింది. ప్రక్కన సరళ లేకపోతే తెరమీది బొమ్మలు అలుకుకుపోతాయి. మరీ పిల్లాడిలా 'రావలసిందే'నంటూ మారాం చేశాడు. సరళ తనవంక జాలిగా చూస్తూ పుచ్చపువ్వు విప్పుకున్నట్లు నవ్వింది. నెమ్మదిగా చెవిలో చెప్పింది. కొన్నాళ్లలో తాను తండ్రి కాబోతున్నాడు. ఓ! ఆనాడు తన కెంత ఆనందం!

—అప్పట్నుంచీ పుట్టబోయే సంతానం గురించి ఎన్ని ముచ్చట్లెన్ని ముచ్చట్లు చెప్పుకొనేవారు. గంటల తరబడి విసుగూ విరామం లేకుండా, ఆరోజు మొదలు బజార్లో పిల్లల వుయ్యాలే కాదు ఆటవస్తువులే కాదు దుస్తులే కాదు గొప్పదేది కనబడితే అది తాను కొనితెస్తూ వుంటే సరళ తన పిచ్చితనం తలచుకొని నవ్వేది.

—రాత్రిం బగళ్లు కలలు కంటూవున్న ఆరోజు రానేవచ్చింది. తాను తహతహ పడిపోయాడు. ఆ నిమిషం ఎంత భయంకరం! బుసలుకొడుతూ విషం క్రక్కే నల్లత్రాచులా వచ్చింది. పంటపొలంలో పారిన వరదలాగా కరిగివచ్చిన అగ్నిపర్వతంలాగా తన సుఖజీవితాన్ని నాశనం చేసివేసింది. డాక్టర్లు ఆదుర్దాపడుతున్నారు. తన ప్రాణాలు కొట్టుకుంటున్నాయి. తొలి కానుపు. ఎంతబాధ. మృత్యుదేవత కంచురథం మువ్వల సవ్వడిలాగా సరళ మూలుగులు మరింత కలవరపెడుతున్నాయి. డాక్టర్లు హోరాహోరి మృత్యువుతో పోరాడి జయించినట్లే జయించి చివరకు వోడిపోయి చేతులు ముడుచుకున్నారు. ఆఖరి గడియల్లో ఏదో చెప్పాలనుకున్నట్టు తనవేపు కళ్లనిండా నీళ్లతో చూడ్డం తప్ప వొక్కమాటా చెప్పలేకపోయింది. పెద్దపులి పంటిక్రింద తలచిక్కిన ఆడలేడి చూపు యెలా వుంటుందో తానెరగడు కాని భయంకర మృత్యుముఖంలో వున్న ఆనాటి సరళ చూపు కలలోకూడా మరువురాకుండా గుండెలు కెలుకుతూ వుంటుంది. తల్లి ఆయువు పోసుకుని అవతరించాడొక అభాగ్యుడు. వీడికోసమా యిన్నాళ్లూ తపించిపోయింది.

ఇంతలో యేదో పక్షి వికృతంగా అరుస్తూ కూర్చున్న రాజారావు తలమీద నుంచి ఎగిరిపోయింది. అతనికి తలపుకు వస్తూవున్న జీవితఘట్టాలన్నీ వొక్క వెచ్చని నిట్టూర్పులో కరిగిపోయాయి. చేతులతో ముఖం కప్పుకుని వెక్కివెక్కి యేడ్చాడు. భార్య పోయిందని వినివచ్చిన చుట్టాలు వొక రెండు మూడు రోజులుండి తనకు రెండుమూడు వైరాగ్యపు ముక్కలూ వొకటి రెండు హితోపదేశాలూ వుపదేశించి చక్కాపోయారు. అడపాదడపా ఎరుగున్న వాళ్లువచ్చి గాయాన్ని కెలికి వెడుతూవున్నారు. రానురాను గదినుంచి బయటకు వచ్చే సాహసంకూడా తగ్గిపోయి పరామర్శకు వచ్చిన పరిచితకోటిని బయట నించే పంపించాడు. అంత మనోవ్యథలోనూ మాతృవాత్సల్య వంచితుడు నిర్దోషి అయిన ఆ పసిపాప యేడుపు వినిపిస్తే చాలు శరీరం మరింత వుడికిపోయేది.

వానకురిసి తేలికపడ్డ మబ్బులా పేరుకున్న దుఃఖమంతా కన్నీళ్లుగా వొడ్చుకుని మళ్లీ గదిలోకి వచ్చాడు. గదిముందు హాల్లోకి వెళ్ళాడు. ఉయ్యాలలో మబ్బుల్లో చంద్రవంకలా నిశ్చింతగా పడుకున్నాడు పసిపాప. ప్రక్కనే ఆయా గుర్రుతీస్తూ వుంది. ఆ పసిముఖంలో కొనతేలిన చిన్ని ముక్కూ లక్కపిడతవంటి యెర్రని పెదవి వంపూ అతనిని చూచి పలకరిస్తున్నాయి పరిచయంగా. భూమికివస్తూనే అతని అమృతపాత్రను తన్నివేసిన అతణ్ణిచూస్తూ హృదయాన్ని రంపకోతకోస్తూవున్న దుఃఖాన్ని యెలా సహించుకోగలడు. ఇక అక్కడ నిలవలేకపోయాడు.

వెన్నెలపాండురోగిలా పాలిపోయి కళావిహీనంగా వుంది. ఇలా నరకయాతన పడుతూ బ్రతికేకంటే హాయిగా యెందుకు చావకూడదనిపించిందతనికి. ప్రవాహంలో

రవి గ్లిసరిన్ సోప్




రవి గ్లిసరిన్ సోప్ అన్ని కాలములలో వాడదగినది. శరీరమును మృదువుగాను, కాంతిగను ఉంచును. సోల్ ఏజంట్లు:-
ది న్యూ స్టార్ & కో., మద్రాసు 21.



నవ్వులు పువ్వులు
ఫోటో: జి. ఎస్. భూషణ్.

# ప్రిస్క్రిప్షన్

కొట్టుకపోయే ప్రాణి ఆధారంకోసం అన్వేషించే ఆదుర్దాలో మొసలికోరలైనా పట్టుకుంటానికి వెనుకాడడు. అల్లానే రాజారావు దుఃఖాన్నించి విముక్తి పొందాలన్న తొందరలో మరణాన్నే ఆహ్వానిస్తున్నాడు. అంతకన్నా దూరం ఆలోచించే వోపికకూడా అప్పుడతనికి లేదు.

ఇనప్పెట్టితీసి యిన్ని నోట్లకట్టలు జేబులో వేసుకుని కారుబయటికితీసి బయల్దేరాడు.

## 2

'డాక్టర్! డాక్టర్!!'

డాక్టర్ కృష్ణమోహన్ నిద్రకళ్ళతో 'ఎవ'రంటూ తలుపు తీశాడు. ఆమసక వెలుగులో నిద్రలేనికళ్లూ చెదిరినజుట్టూ మాసిన గడ్డం వాడిన ముఖం పిచ్చివాలకంతో యెదురుగుండా రాజారావు ప్రత్యక్షమయ్యాడు. డాక్టరతనిస్థితికి జాలిపడుతూ 'రావోయ్' అంటూ అతని కొక కుర్చీ చూపిస్తూ తను వొకకుర్చీలో కూర్చున్నాడు.

క్లబ్బులో కలిసినపరిచయం ముదిరి స్నేహమయి యిద్దరిమనసుల్నీ ముడివేసింది రెండు మూడేళ్లక్రితం. అదిగాక యేదో దూరపు బంధుత్వంకూడా బయటపడింది మాటల్లో. అంతకన్నా రెండుకుటుంబాలు తరుచు రాకపోకల్తో మరీ దగ్గరవా వచ్చాయి. డాక్టరుభార్య పద్మావతి రాజారావును మరిదిగారంటూ వేళాకోళాలు పట్టించేది.

సరళను బ్రతికించాలని డాక్టర్ తన శాయశక్తులా ప్రయత్నించాడు. మనిషి తెలివితేటలన్నీ చెరిపివేసే చెయ్యి వొకటున్నప్పుడతనేం చేయగలడు!

'డాక్టర్!–' అన్నాడుకాని గొంతులో నిండిన విచారంతో పై మాటలు పెగిలి రాలేదు. కొంచెం ఆగి నిదానంగా అన్నాడు. "చూడు కృష్ణా! నువ్వు మిత్రుడికోసం చాలా శ్రమపడ్డావు. కాని నా దురదృష్టమే నిన్ను వోడించింది. నీకు మా యిద్దరి అనుబంధం తెలుసు. ఆమె పోయాక యీ పదిరోజులూ యిలా జీవించగలిగానంటే నా అనురాగానికి ఒక మచ్చ. రాత్రింబగళ్ళు యీ వ్యథే నన్ను వేటాడుతూ వుంది. ఇలా శాంతిలేకుండా బాధతో బ్రతికేకన్నా వొక్కసారి చనిపోవడం మేలు. నా సరళను నాకివ్వలేకపోయావు పోనీ, నన్ను త్వరగా సరళతో చేర్చే మార్గం చూడు. మిత్రుడవుగా నాకు చేయవలసిన వుపకార మిది." అని.

రాజారావులోవున్న ఆ క్షణికోద్వేగం మనిషి నెంతయినా చేయిస్తుంది. నిత్యం లోకంలో జరిగే హత్యలూ ఆత్మహత్యలూ అన్నిటికీ మూలం యిటువంటి పైశాచిక

ర్యాగమే. ఇది మంచీ చెడ్డా చూడగల మానవుని జ్ఞానచక్షువుమీద నల్లని తెర దించివేస్తుంది.

డాక్టర్ తన కుర్చీని దగ్గరసా లాగికొని స్నేహంగా రాజారావు తల నిమురుతూ "పిచ్చివాడా, పోయినవాళ్లతో పోయేవారెవరుంటారోయ్! ఉన్నవాళ్లతోనే వుండాలికాని. మనకోసం కాలధర్మం మారుతుందా. పాపం! ఆ నిర్భాగ్యుడు తల్లి స్తన్యాని కెలానూ దూరమయ్యాడు. తండ్రి స్నేహానికి కూడా యెందుకు దూరం చేస్తావు" అన్నాడు చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంటూ.

కొడుకు ప్రశంసకు రాజారావు హృదయం భగ్నమంది. 'ఆ దౌర్భాగ్యుడి కోసమా నేను బ్రతకడం?' అన్నాడు.

ఒక రోజున తనసుగురించి తండ్రే ఇలా భావిస్తే తన బ్రదుకప్పు డేమయేదో? మనిషికంత ఆత్మవిశ్వాసం అనేది వుంటే లోకం యింత అధ్వాన్నంగా యెందుకుంటుంది?

'నాకు బ్రదుకుమీది మోజుతీరిపోయింది. బ్రదికి చెయ్యవలసిందీ లేదు. ఎవడి విధి వాడ్ని యీడ్చుకుపోకుండా ఎల్లానూ విడిచిపెట్టదు. నిజానికి నేను బ్రదికున్నా సరళతో ఆనాడే చనిపోయినట్టే లెక్క. ఇక పోతే లోకానికి మాత్రం నా శవాన్ని అప్పగించాలి. నువ్వు నాకు మిత్రుడవు. డాక్టరువి. నా యీ వ్యాధికి మృత్యువే శరణ్యం. అందుకే తగిన మందివ్వాలి.'


రాజారావు పడుతూవున్న బాధ డాక్టరుకు తెలుసు. అతనికన్నా తాను వయస్సులోనూ అనుభవంలోనూ ఎంతో పెద్దవాడు.

'రాజా! కాలగమనం చాలా విచిత్రమయింది. ఇవ్వాళ కత్తికోతా రేపు గంధపూతా రెండూ. దానికి వక్కు. పెద్ద కెరటం వచ్చినప్పుడు తలవంచితే చాలు మనమీదుగా వెళ్ళిపోతుంది. మరుక్షణంలో లేచిచూస్తే యేమీ వుండదు. కాదని దాన్ని యెదుర్కోవాలంటే పడక తప్పదు. జీవితంలో వచ్చిన యేదుర్ఘటనా స్థిరంగా నిలిచిపోదు. కాని ఆక్షణంలో మాత్రం దానికి తలవంచక తప్పదు యెంత పుక్కిరి బిక్కిరైనా.'

రాజారావుకు కోపం చిరాకూ కలిగింది. 'డాక్టర్! నీదగ్గరకు నేను జీవితతత్వం వినడానికి రాలేదు. ఏ వైరాగిని కదిలించినా

దీపావళీ తిలకించగ
భువి నిలచిన తారకలు!!

ఫొటో: నాళం కామేశ్వరరావు—రాజమండ్రి.



## ప్రిస్క్రిప్షన్

హైందవ వేదాంతసారాన్నింతకన్నా యెక్కువే వొలకబోస్తాడు. నాకు కావలసింది బ్రదకడం కాదు చావడం. చచ్చేవాడికి నీతత్వోపదేశాలెందుకు మిష్టర్'

డాక్టరు నవ్వుకున్నాడు. ఏళ్లకొద్దీ శ్రమపడి చదివి పరీక్షలిచ్చి పట్టా తెచ్చుకున్నది ప్రాణుల్ని రక్షించడానికి కాని ప్రాణాల్ని తియ్యడానికి కాదు. అతనికి నిజంగా చావాలనివుంటే తనదగ్గిరకే రావాలా! ఏదో బలహీనత వుంది. అది కనిపెట్టాలనుకున్నాడు.

'అయితేసరే. నువ్వుచావాలంటే యెన్ని మార్గాలులేవు. నన్నుకూడా యిరికించడం దేనికి? నూనే నల్లమందు త్రాగవచ్చు. రైలు క్రింద పడవచ్చు. కాలవలో దూకవచ్చు. బట్టలకు నిప్పంటించుకోవచ్చు. -'

రాజారావు వొళ్లు జలదరించింది. అతని చిన్నతనంలో జరిగిన సంగతి వొకటి జ్ఞప్తికి వచ్చింది. ఒకమ్మాయి భర్తతో పోట్లాడి బట్టలకు నిప్పంటించుకుంది. ఎల్లా అయితేనేం యిరుగూ పొరుగూ చేరి ఆర్పి




వేశారు. ఆ అమ్మాయి యెన్నాళ్లో తీసుకు తీసుకుని చివరకు బ్రదికింది. ఆ ముఖం అగ్నిదేవుని దండయాత్రకు పూర్తిగా లొంగిపోయింది. ఎవరూ చూడలేకపోయే వారు. పాపం ఆఖరి కతి నికృష్టపు బ్రదుకయిపోయింది.

'నువ్వన్నది నిజమే. చావాలంటే నూటొక్క మార్గం. నా కలాటి చావువద్దు. గాలి తాకిడికి కొమ్మ చివరనుండి నవ్వుతూ రాలిపడే పువ్వులా చనిపోవాలి. కెరటం రాపిడికి తామరాకున నీటిబొట్టు జారిపోయే టట్టు చావురావాలి. నాకు స్వాగతమిచ్చే పరకేను నవ్వుతూ కలుసుకోవాలి. అందుకే నిన్ను కోరడం.'

డాక్టరతని బలహీనత గ్రహించాడు. నిజానికతనికి చావంటే యిష్టంకాదు సరే తగనిభయం. గుండెలు పిండే విచారాన్ని తట్టుకోలేకపోతున్నాడు. దాన్ని తప్పించుకోవడానికి అటువంటి స్థితిలో యెందరో త్రాగుబోతులూ, చరిత్రహీనులూ, సన్యాసులూ అయారు.

రాజారావు స్థితి యింకా ముదరలేదు. కాలవ్యవధితో అతనిలో మార్పు తేవచ్చు. కాని అంతవరకూ పాదరసంలావున్న అతని బుద్ధి మృత్యుద్వారం కేసి పరుగెత్తకుండా పట్టుకోవాలి. అనుకున్నాడు డాక్టర్.

'రాజా! చనిపోవడమే ముఖ్యమై నువ్వు తప్పదంటే వొక్క డోస్ చాలు. మృత్యుదేవత కరాళస్వరూపంతో ప్రత్యక్షమవుతుంది. దాహంతో నాలిక పీక్కుపోతుంది. ప్రత్తికాయల్లా గుడ్లు పైకొస్తాయి. ముఖం బొగ్గులా నల్లబడిపోతుంది. గొంతులో కండరాలన్నీ వుబ్బిపోతాయి. రోమరోమం దవాగ్నులతో దహించుకుపోతుంది. కాళ్లూ చేతులూ మెలికలు తిరిగిపోతాయి. నురుగులు కక్కుకుంటూ ఆ కొన్ని నిమిషాలే అనుకో చిత్రవధలన్నీ అనుభవించాలి.'

మాటలతో బొమ్మగ్రాసి చూపాడు భయంకరంగా డాక్టర్. రాజారావు ముఖకవళికలు గమనిస్తూ తన బాణం గురి తప్పలేదనుకున్నాడు.

పాలిపోయిన ముఖంతో తేలిపోయిన గొంతుతో అతి నీరసంగా తడబడుతూ రాజారావు 'వద్దు డాక్టర్! వద్దు అలా వద్దు మందుతీసుకుని రాత్రి పడుకుంటే. ఏ కలలోనో హాయిగా తలుపు తెరచిన పంజెరంలోనించి చిలుకలా ప్రాణంపోవాలి. అదీ నా కోరిక. మళ్ళి వొకసారి నీ గ్రంధాలు తిరగెయ్. అందుకు నీ క్కావలసినంత ఫీజు తీసుకో.' అంటూ జేబులో నోట్ల కట్టలు టేబిల్ మీద పడవేశాడు.

డాక్టర్ రోగితో కాదని వాదించి

నొప్పించే కన్నా అవునని నమ్మించి నయం చేయవలసిన వ్యాధులుంటాయి కొన్ని సున్నితమైనవి. అనుభవజ్ఞుడైన డాక్టరుకాని అర్థం చేసుకోలేడవి.

'అయితే నాకొక పదిరోజులు గడువియ్యి.'

'పదిరోజులా! ఒక్కరోజు గడవటం ఒక్కయుగంలా వుంది. నువ్వెంత చప్పున తేలిస్తే అంత మంచిది.'

'పోనీ వారం చాలులే. వెలుగును చెయ్యాలి చీకటిని పట్టుకుని. మరణం వరప్రసాదంలా వుండాలి. అవునా'

'అల్లాగే' అంటూ లేచాడు రాజారావు.

ఏకాంతం దుఃఖానికి కన్నతల్లి. రాజారావు గుడ్లగూబలా గదివదిలి బయటకు రావటంలేదు. అతణ్ణి మనుషులలో త్రిప్పాలన్న సంకల్పంతో డాక్టర్ 'రాజా. నా అశ్రద్ధా మతిమరుపూ నీకు తెలిసిందే సాయంత్రానికల్లా యీ విషయమే మరిచిపోతానేమో. నీ పని అయ్యేఅంతవరకు నువ్వు నన్ను వెంటాడడం మానకు. సాయంత్రం నేను డిస్పెన్సరీనుంచి వచ్చేవేళ కిటు వస్తూవుండు. మరిచిపోవద్దు' అన్నాడు.

'అల్లాగే' అంటూ రాజారావు వెళ్ళిపోయాడు. డాక్టరు మానవమన స్తత్వాన్ని గాఢంగా ఆలోచిస్తూ అల్లాగే కుర్చీలో కూర్చుండిపోయాడు; అప్పుడే కలకత్తా మెయిల్ దిగివచ్చిన మరదలు 'బావా కులాసాయేనా! ప్రొద్దుటే నోట్లు లెక్కపెట్టుకుంటున్నావేం' అని పలకరించే దాకా.

## 3

'సరూ!' అన్న పిలుపు విని గుమ్మంలో కాలుపెడుతూవున్న రాజారావు త్రుళ్ళిపడ్డాడు. తనకు తన సరూ దూరమైపోయింది. డాక్టరింటికి వచ్చాడో లేదో అనుకుంటూ హాల్లోకి నడిచాడు. సోఫాలో కూర్చుని వొక సుందరి యేదో అల్లుకుంటూ వుంది దీక్షగా. రాజారావటు చూడకుండానే 'డాక్టర్!' అని కేకవేశాడు. ఆమె లేచి నిలుచుంది. 'కూర్చోండి. బావగారు వచ్చేటయిమయింది.' అన్నది. గాలికి పూతీగలు కదిలినట్లయినాయి. రాజారావామెవేపు చూచాడు. సమర్థుడైన శిల్పి మలిచిన విగ్రహంలాగా సౌందర్యరేఖలు నూత్నయౌవనంతో ప్రస్ఫుటమవుతూ వున్నాయి. తలంటుకోవడంవల్ల విచ్చలవిడిగా వున్న వుంగరాల ముంగురులు పంకాగాలికి వయ్యారంగా వుయ్యాల లూగుతున్నాయి. కరిగిపోసిన బంగారు కలశలాంటి శరీరం. తెల్లని మధుర జరీచీర కుచ్చెళ్లు తామర మొగ్గల్లాంటి పాదాలమీద చిందులు త్రొక్కుతున్నాయి. ఆ అందం అతను తప్పించుకుంటూ వున్నా తనవైపు బలవంతంగా త్రిప్పుకుంటూ వుంది.

'సరూ!' అంటూ హాల్లోకి వచ్చిన డాక్టర్ భార్య పద్మావతి రాజును చూచి ఆశ్చర్యపోయింది. 'రాజా!...' అంటూ యేదో అనబోయేలోగా సరళ కన్నుల్లో కదిలినట్లయి ఆమె హృదయం కలతపడింది. 'అక్కయ్యగారూ' అంటూ యే చిన్న సంగతయినా యెంతో యిదిగా చెప్పుకొనేది. కళ్లలో నీళ్లు తిరిగాయి ఆమెను తలచుకోగానే. 'చాలా చిక్కిపోయావు నాయనా!' అన్నది జాలిగా. 'వారు వచ్చేవేళయింది. లోపలికి రా రాజా' అంటూ.

రాజారావుకు తెలుసు డాక్టర్ భార్య తన్ను టీ తీసుకోకుండా వెళ్లనివ్వదని. తప్పించుకోవడానికి ఎన్ని దారులున్నాయో అన్నీ వృధా అయినాయి పద్మావతి వాత్సల్యం ముందు.

ముగ్గురూ ఫలహారాలు తీసుకున్నారు. సరళమంచితనం తలుచుకోవడంతో మొదలుపెట్టి యేవేవో పద్మావతి చెప్పుకుంటూపోయింది. సరోజిని అక్కగారిమాట వొకటి రెండుసార్లు అందుకున్నది. రాజారావు మాత్రం అనాసక్తియోగంతో అన్నీ వింటూ కూర్చున్నాడు. సరోజిని డాక్టరు మరదలు. ఇంటరు చదువుతూవుంది తెనాలిలో. దసరా సెలవలకని మద్రాసు అక్కగారింటికి వచ్చింది. కాలక్షేపం మొత్తంలో యీ మూడూ ముక్కలూ చెదిరి చెవిలో పడ్డాయి అతనికి.

డాక్టర్ యెంతసేపటికి రాలేదు. 'రేపు కలుసుకుంటా'నని వాళ్లదగ్గర సెలవు తీసుకుని యింటికి వచ్చేశాడు రాజా.

మర్నాడుదయం రాజారావు డాక్టరింటికి బయల్దేరుతూవున్నాడు. 'ఇప్పుడెందుకు?' అని యేదో అశరీరవాణి ప్రశ్నించినట్లయింది. 'నిన్న డాక్టర్ని కలుసుకోలేకపోయా. ఈపూటన్నా కలుసుకోవాలి.' అనుకున్నాడు. 'డాక్టర్ని కలుసుకోవాలనే నిజంగా' అన్నదా తర్కవాణి. 'ఇంకేం పనున్న దక్కడ' అనుకున్నాడతను. 'ఇది యింట్లో వుండే టైము కాదేమో!' అన్నదా అశరీరి. 'వెనక కళ్ళింకలు వెళ్ళివస్తే తీరిపోయేదానికి' అనుకున్నాడు రాజారావు. అంతటితో అది కాస్తా అతని హృదయపు మడతలలో అణుగునబడిపోయింది.

కారుదిగి గేటు దాటడంతోనే కమ్మని సంగీతం అతని చెవులలో అమృతపు సుళ్లు తిరిగింది. ముందుహాలులో యెవరూలేరు. ప్రక్కగదిలోనించి వీణాగానం వినిపిస్తూవుంది. మధ్యమావతిరాగం తియ్యని వొదుగుల్లో మధురంగా తేలిపోతూవుంది. చిగురుపక్షులు బారులుతీర్చి ఆకాశంలోకి యెగిరిపోతూవున్నట్టు కొండశిఖరాలనుంచి నదీదేవతలవనికి దిగివచ్చినట్టు పువ్వులురేకు విప్పుతూవున్నట్టు వెన్నెలలు వ్యాపించినట్టు రాగం ఆరోహణావరోహణలతో చక్కని గమకాలతో ఆనందశిఖరాలకు తీసుకువెడుతూవుంది. 'డాక్టర్!' అంటూ కేకవేసి ఆ అమృతప్రవాహానికి అడ్డుతగలడాని కిష్టం లేకనో తాను వచ్చినపనే మరిచిపోయో తన్మయుడై వింటున్నాడు. — 'ముని కనుసైగ తెలిసి శివధనువును విరచెడిసమయమున త్యాగరాజవినుతుని మోమున రంజిల్లు అలకలు' - అతనిహృదయంలో పులకలు కలిగిస్తున్నాయి

'మీరువచ్చి ఎంతసేపైంది. బావలేడు. అక్కయ్యను పిలవనా?' అంటూ హాల్లోకి వస్తూ సరోజిని పలకరించే అంతవరకూ అతనా పులకరింపులోనే వున్నాడు.

'మీరు చాలా కమ్మగా వాయిస్తారు వదినగారికంటే'

ఆమెప్రశ్న కది జవాబుకానిమాటనిజమే కాని అసలతనా ప్రశ్న వినలేదాయె. అందు కతన్ని తప్పుపట్టడంకూడా సబబు కాదేమో.

'మీ మాటలో వీణ వొగిదిపోయి అమృతాన్ని వర్షించింది. మంచి సాధక చేశారు.'

సరోజిని అతని మాటకు సిగ్గుతో తలవాల్చింది. పండు తమలపాకులవంటి ఆమె చెక్కిళ్లు ముద్దగన్నేరులైనాయి.

రాజారావు ఆమె అభ్యాసాన్ని గురించీ తనకు సంగీతం అంటే వున్న యిష్టాన్ని గురించీ అడుగుతూ చెపుతూ వుంటే — నిన్న అక్కయ్య చెప్పిన సంగతులవల్ల ఆతనంటే ఆమెకొక గౌరవభావం యేర్పడింది. అందువల్ల అన్నిటికీ క్లుప్తంగా సమాధానాలిస్తూ శ్రద్ధగా వింటూవచ్చింది. అల్లా ఆమెతో రోజల్లా మాట్లాడుతూ గడిపితే బాగుంటుం దనుకున్నాడు'

'మీరు వచ్చారని అక్కయ్యతో చెపుతా' నంటూ సరోజిని లేచింది. 'వద్దులెండి. సాయంత్రంవస్తా మీ బావగారిని యింటివద్దనే వుండమనండి' అంటూ రాజారావుకూడా లేచాడు.

ఆ మధ్యాహ్నం భోజనంచేసి రాజారావు చాలాసేపు నిద్రపోయాడు. సాయంత్రం డాక్టరింటికి వచ్చేటప్పటికి చదరంగం మాంచి జోరుగా సాగుతూ వుంది. మొదట్లో కాలక్షేపానికి అక్కాచెల్లెళ్ళు ప్రారంభించారు. సరోజిని

# ★ ప్రిస్క్రిప్షన్ ★

అక్కగారి రాజును ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువులు నీళ్లు త్రాగిస్తా వుంది. అప్పుడే డిస్పెన్సరీనుంచి వచ్చిన డాక్టర్ విశ్రాంతి కూడా తీసుకోకుండా భార్యా కొమ్ముకాశాడు. సరోజిని బావగారి ఎత్తులతో తికమకపడుతూవుంది. డాక్టర్ త్రోసిరాజనిపించాడు. సరోజిని ఆలోచనలో పడ్డది. ఆట మంచి రంజుగా పాకాన పడింది.

'శకటును మీ రాజు కడ్డువేసి తెరచి రాజనండి' అన్నా డొక చూపుతో ఆటంతా ఆకళించుకుంటూ రాజారావు. ఆటరంధిలో అతను వచ్చిం దెవరూ చూడలేదు. ఆరు కళ్ళూ వొక్కసారి అతనివంక తిరిగాయి.

సమవుజ్జీల మధ్య సమరం సాగింది. అటు డాక్టరూ యిటు రాజారావూ సలహాదారులు. చివరికాట మొండిపడింది. చాలని విసుగెత్తి లేచేటప్పటికి ఎనిమిదిన్నరయింది. డాక్టరు దంపతుల బలవంతంమీద రాజారావు కాపూట అక్కడ చెయ్యి కడుగక తప్పలేదు. ఈనెలు తీసి సున్నం రాసి సరోజిని యిచ్చిన లేత కవటాకు మడుపులూ వక్కపొడి అందుకుంటూ స్నేహితులిద్దరూ హాలులోకి వచ్చేటప్పటికి గడియారం పదిగంటలు కొట్టింది. రాజారావు 'గుడ్ బై' చెప్పి వెళ్ళిపోయాడు. డాక్టర్ పడకకుర్చీలో జార్లబడుతూ నవ్వుకున్నాడు. 'ఆట గొడవలోబడి అసలు సంగతే మరిచిపోయాడమాయికుడుపాపం.' అనుకున్నాడు.

సరిగ్గా అదేఅనుకున్నాడు గదిలో పందిరి మంచంమీద దేహం వాలుస్తూ రాజారావు కూడా.

రాజారావు వుదయం కాఫీ తీసుకున్నాక డాక్టరుతో నిన్న మాట్లాడనేలేదు' అన్నది' నాటకంలో స్వగతంలాగా అతనిబుద్ధి. 'ఇప్పుడింటికి వొకసారి వెడితేసరి మాట్లాడిరావచ్చునుగా అన్నది మనస్సు జనాంతికంగా. ఎందుకనో యే అశరీరవాణీ అతడ్ని అభ్యంతరం పెట్టలేదు.

రాజారావు వెళ్లేటప్పటికి అక్కాచెల్లెళ్ళిద్దరూ ముస్తాబై యెక్కడికో ప్రయాణం మీద వున్నారు.

'డాక్టరులేడాఅండి?' అన్నాడు మర్యాదకన్నట్టు అతను.

'రావోయి రాజా, మంచిసమయానికి వచ్చావు. మా సరోజ పాపింగుకు రమ్మంటే బయల్దేరాను. శ్రమ అనుకోకపోతే నువ్వు కూడా మాతో వస్తే బేరంలో మోసపోం' అన్నది పద్మావతి నవ్వుతూ ఆప్యాయంగా.

రాజారావు అని చూద్దాం అన్నట్లు 'నేనెందుకులెండి వర్తకుల ప్రాణాల్ని తియ్యడానికి వదినగారు చాలు' అన్నాడు బదులు నవ్వుతూ.

ముగ్గురూ నవ్వుకున్నారు. నిన్న ఆటలో యేర్పడిన పరిచయంతో సరోజిని 'మీరు కూడా రండి సరదాగా వెళ్ళొద్దాం' అన్నది చనువుగా.

తప్పనిసరి బలవంతంమీద అన్నట్లు రాజారావు వొప్పుకున్నాడు. 'అయ్యగారు వస్తే మాకోసం కనిపెట్టుకోవద్దని భోజనం చెయ్యమను' అని వంటామెకు పురమాయించి వచ్చిన పద్మావతితో ముగ్గురూ కారెక్కారు.

బట్టల షాపులూ నగలదుకాణాలూ ఫాన్సీ స్టోర్సూ అన్నీ తిరగేశారు. ఇన్ని పొట్లాలతో కారు నింపారు. అప్పటికి పన్నెండున్నరయింది. ఇంక చేయవలసిన ఆటవస్తువుల ఖరీదు కురదలా వుండనేవుంది. నీరసంతో ఆత్మారాము డాక్రోశిస్తూ వున్నాడు. కారు వుడ్‌లాండ్సుకు నడిపించారు.

ముగ్గురూ భోజనంచేసి వొక అరగంట రెస్టు తీసుకుని బజారుపని ముగించుకొనేటప్పటికి రెండున్నరయింది. ఆ రోజుననే మినర్వాలో క్రొత్త పిక్చర్ రిలీజయింది. మాటినీకి వెడదామనుకున్న తీర్మానం వీకగ్రీవంగా పాసయింది.

సినిమానుంచీ వస్తూవుంటే అనుకోకుండా డాక్టరు కలిశాడు. అతడ్నికూడా ఎక్కించుకుని అందరూ బీచీకి బయలుదేరారు. ప్రొద్దుటినించీ పడ్డ శ్రమ అంతా చల్లని సముద్రపుగాలితో తీరిపోయినట్లయింది.

సరోజిని సెలవలు కొస్తా కర్పూరంలా కరిగిపోయి పూరుకున్నాయి. చివరి రెండు మూడురోజులూ రాజారావు తనకారులో యెక్కించుకొని సరోజినికి పట్నంలో చూడవలసిన వొకటొక్కటీ చూపించాడు. మ్యూజియము - జూ - మూరుమార్కెట్టు - అడయారు - లైటుహౌసూ - హైకోర్టు - పార్కులు స్టుడియోలు - రేడియోస్టేషన్ అన్నీ చూస్తూ సరోజిని తనవంక కృతజ్ఞతతో చూస్తూవుంటే అతని మనస్సు పురివిప్పిన నెమలిలా అయింది.

సరోజిని వెళ్లేరోజున డాక్టరు దంపతులతోపాటు అతనూ స్టేషనుకు వచ్చాడు సాగనంపడానికి. సరోజిని హృదయం ఆనందంతో తాను చూచిన మద్రాసు విశేషాలు తమ్ముళ్లతో చెల్లెళ్లతో చెప్పుకుని మురవడానికి ఆత్రపడుతూ వుంది. తన సామానంతా సద్దుకుని సరిచూచుకుని అక్కదగ్గిర బావదగ్గిర సెలవుతీసుకుని 'తెనాలి వస్తే మాయింటికి తప్పకుండా రావా'లని రాజారావుతో 'అట్లానే' అనిపించుకుని అందరికీ 'నమస్తే' చెపుతూవుంటే రైలు కదిలింది.

సెంట్రల్ నుంచి యింటికి వస్తూవుంటే పద్మావతి తనకుగలిగిన ఆలోచన భర్తకు వినిపించి అభిప్రాయమడిగింది. అందుకు డాక్టరు, 'అంతకన్నా కావలసిందేమి' టన్నట్టు పద్మావతి వేపు చూచాడు. ఆ చూపులో అర్థం 'మగవాళ్లకంటే ఆడవాళ్లు యిటువంటి విషయాలు గ్రహించడంలో చాలా చురుగ్గా వుంటా' రని భావించిన పద్మావతిని సునుసిగ్గు ముంచివేసింది.

## 4

డాక్టర్ రాజారావింటికి వచ్చాడు. రాజారావు వరండాలోనే పడకకుర్చీలో


ప్రశ్నోత్తరావళి
Guide to Algebra & Trigonometry
(బి. ఎ., బి. ఎస్. సి., మెయిన్, సబ్సిడరీ విద్యార్థులకు)
వెల రూ. 3/4/-
"ANALYTICAL GEOMETRY" and "CALCULUS"
బి. ఏ. (ఆంధ్రయూనివర్సిటీ) వెల రూ. 4/-
పానుగంటి లక్ష్మణరావు M. A.
రైలుపేట : గుంటూరు.
ఆంధ్రదేశములో అన్ని కేంద్రములలో ప్రతులు లభించగలవు.



అకాలనెరసి బట్టను ఆపుటకు
కాష్మీర్ - కుసుం
మీ ఇష్టమైన నూనెలో నానవేయండి
యునైటెడ్ కెమిసరల్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.
చర్మ ఉపద్రవములకు, అపాయములకు
అత్యున్నతమైన సుగంధ ములాము
సాంటలక్స
గజ్జి, పుండ్లు, కాటులు, మొటిమలు

## ప్రిస్క్రిప్షన్

పడుకుని సిగరెట్ పొగలతో మబ్బుల్ని సృష్టిస్తూ సినిమా పత్రిక చదువుకుంటు న్నాడు. డాక్టరుకు 'వెల్‌కం' చెప్పి కుర్చీ చూపాడు సిగరెట్ ఆఫర్ చేస్తూ.

'రాజా, నిన్న వస్తావేమో అని యింటి దగ్గరే వుండిపోయా. నువ్వు రాలేదు. బద్ధకించి నేనూ రాలేకపోయాను.' అన్నాడు డాక్టరు సిగరెట్ వెలిగిస్తూ.

'ఏమంత అర్జంటుపని'అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు రాజారావు.

'ఏంలేదు. మనం అనుకున్న గడువు నిన్నటితో సరి.'అన్నాడు డాక్టరు అదోవిషయం కానట్టు తాపీగా.

రాజారావు వెంటనే గ్రహించలేక 'ఏమిటా' అనుకున్నాడు. కాని, వెంటనే గుర్తుకువచ్చింది. ఒక వారం క్రితం చనిపోవడానికి డాక్టర్ని మందడగడం, అతను గడువు పెట్టడం. రాజారావు ఆపదశంకించిన తాబేలులాగా తనలో తాను ముడుచుకుపోయాడు. 'ఎల్లా అయితేనేం నీ కోరిక నెరవేర్చ గలిగినందుకు సంతోషిస్తున్నా. తృప్తిగా భోజనంచేసి సుఖంగా నిద్రపోయే ముందు వొక్క పది చుక్కలు నాలికమీద వేసుకుంటే చాలు. యోగనిద్రలాటి నిద్రలో తల చెదరకుండా బట్ట నలగకుండా కళ తప్పకుండా కాంతి చెడకుండా రవ్వంత శ్రమలేకుండా నవ్వుతూ పువ్వులోనుంచి తేనె జారినట్టు తెలియకుండా ప్రాణం పోతుంది' అన్నాడు డాక్టర్ చిటిక వేస్తూ.

రాజారావు గుండెలు వేటగాడి అడుగుల చప్పుడు విన్న కుందేలు పిల్లల్లా గుబగుబలాడిపోయాయి. డాక్టరు ఆ మందుకోసం తాను పడ్డ కష్టం, మందు ప్రభావం వర్ణిస్తూ వుపన్యసిస్తున్నాడు. రాజారావు కవన్నీ మృత్యుదేవత మెడలో మెరిసే పుర్రెలదండ గలగలలుగా వినిపిస్తున్నాయి.

డాక్టరూరుకున్నాక కొంచెం తేరుకుని అతనింతవరకు చెప్పింది తన కర్థం కానట్టు రాజారావు ప్రారంభించాడు. 'డాక్టర్! ఒక్కసారి—'

డాక్టరు అర్థోక్తిలోనే అందుకున్నాడు. తనపని పూర్తిచేసుకోగలిగాననన్న సంతోషంలో ఎవరిమాటా వినిపించుకోనేటట్టు లేదు. 'నీకు సందేహం వద్దు; రాజా! ముందు జంతువులమీద ప్రయోగించి ఫలితం తృప్తిగా వున్నాకనే ప్రచారంలోకి తెచ్చారీ మందు. ప్రతి సామాన్యుడికీ అందుబాటులో లేనంత ఖరీదు పెట్టారు.' అన్నాడు డాక్టర్.

'అదికాదోయ్, పిల్లాడ్ని—' రాజారావింకా మాట ముగించనేలేదు.

'అబ్బే! నువ్వు పిచ్చిలో పడుతున్నావ్ రాజా! చనిపోయేముందిటువంటి ఝంఝాటాలు పెట్టుకొని మనస్సు పాడు చేసుకోవడం అనవసరం. ఎవడి ఖర్మ వాణ్ణి గొల్లానూ లాక్కుపోతుంది.' అన్నాడు డాక్టరు నిర్వికారంగా.

రాజారావుకు గంగ వెల్లువెత్తుతూ వున్నాయి; డాక్టర్ని చూస్తావుంటే. 'నామాట వినవోయ్ బాబూ, ఒక్కసారి దేశం చుట్టిరావాలని వుంది నాకు. పిల్లవాడి భారం నువ్వు అప్పగించుకుంటే నేనెక్కడున్నా నిర్భయంగా వుండగలను.' అన్నాడు రాజారావు; డాక్టరు ముఖంకేసి చూడలేక తలవంచుకుని కాలిమీద లేనిదానిని దేనినో దులుపుకుంటూవున్నట్టు.

డాక్టరు తననుతాను నమ్మలేకపోయాడు. 'ఒక్కవారంలో యింత మార్పా! పిచ్చికగూడులాంటి మనిషిహృదయం బహువిచిత్రంగా భగవంతుడేపదార్థాల మిశ్రమంతో

(78-వ పేజీ చూడండి)

పండుగ వెలుగుల నిండు ఆనందం

సంతోషప్రదమైన ఈ దివ్య దీపావళీ శుభసమయాన

ప్రసిద్ధిగన్న

★ లోధ్ర ★ అమృత ★ అమృ

నిర్మాతలు అశేషప్రజానీకానికి అందజేసే ఆరోగ్య అనందశుభకాంక్షలు యివే అందుకోండి.

కేసరి కుటీరం లిమిటెడ్

రాయపేట - మదరాసు

# ప్రిస్క్రిప్షన్

(15-వ పేజీ తరువాయి)

చేశాడో కాని అంతు దొరకదు!' అనుకున్నాడు.

"రాజా, నువ్వు పొరపడుతున్నావు. చోటు మారినంతలో గ్రహపాటు మారుతుందా? నీ విషాదజీవితం నీడలాగా నిన్ను తరుముతూనే వుంటుంది. తల్లి వొడిలాగా అన్ని దుఃఖాల్నీ మరిపించేది మృత్యువే. నీకు అంతకన్నా శాంతిమార్గం లేదు. ఆ పతివ్రత సరళవంటి ప్రేమస్వరూపిణిని పోగొట్టుకున్నాక ఎంత అల్పుడైనా జీవించాలని కోరుకోడు! ఎందుకటువంటి బ్రదుకు కెవరికి భారంకాదు?"అంటూ వొక్కొక్కమాటా నూరి పదునుపెట్టి రాజారావు గుండెకు సూటిగా వదుల్తున్నాడు డాక్టర్.

పెద్దపెద్ద ఆపరేషన్లు చేసేటప్పుడు నిర్దయగా విషబీజాలు ప్రాకినంత మేరా గాలించి కత్తిరించివెయ్యడం డాక్టర్లవృత్తి ధర్మం.

రాజారావుకు డాక్టరు మాటలు వింటూ వుంటే అసహ్యం వేసింది. 'తానేదో క్షణికమైన దౌర్బల్యంలో అన్న మాట పట్టుకొని యిప్పుడు తనను చంపడానికి సిద్ధమయ్యాడు. స్నేహితుడుగా తన్ను ఆదుకోవలసింది పోయి యముడిలా ప్రాణాల్ని చేదుకోవడానికి చూస్తున్నాడు. తోటి మానవుడ్ని నిర్దయగా కత్తులతో కోసే కసాయిజాతి వీళ్లది!' అనుకున్నాడు.

'నిజమే డాక్టర్: కాని కొన్నాళ్ళు దేశంకాని దేశంలో, భాషన్నా తెలియని వాళ్ల మధ్య, ప్రవాసిలా కాలం గడిపిరావాలని వుంది' అన్నాడు రాజారావు మరణానికి అసంసిద్ధత తెలుపుకుంటూవున్నట్టు.

డాక్టరు తెల్లపోయినట్లు 'నిన్ను నమ్మి మందు కూడా తెప్పించా.' అన్నాడు.

రాజారావు మనస్సులో డాక్టర్ని పరమ ఛండాలుడిగా తిట్టుకుంటూ పైకి మాత్రం రాజీపడుతూవున్నట్టు 'నువ్వు నష్టపడడం దేనికి? ఆ మందు ఖరీదు తీసుకోవోయ్!' అన్నాడు.

డాక్టరు గొణుక్కుంటూ వున్నట్టు 'మందు సంగతి సరే. నువ్వు ముందుగానే ముట్టచెప్పిన ఫీజు మళ్ళీ...'...పై మాటలు మ్రింగివేశాడు.

రాజారావుకు డాక్టరింత ఆశపాతకుడని తెలియదు. ఆ పిసినారితనం రోత పుట్టించింది. 'ఫీజుకోసం నిండు ప్రాణాన్ని బలి కోరుతున్నాడు. షైలాక్. మానవుడు కాడు దానవుడు.' అనుకున్నాడు.

'వద్దు డాక్టర్. పాపం నీ ఫీజెందుకు నష్టపోవాలి? కక్కినదానికంటూ ఆశపడతా ననుకున్నావు. భయపడకు! నీ ఫీజు కిచ్చిన విలువ మిత్రుడి ప్రాణాలకివ్వలేకపోయావు. డబ్బుదగ్గిరికి వచ్చేటప్పటికి నీ స్వరూపం బయటపెట్టావు. అదే నా కుపకారమైంది. నా కళ్లు తెరిచావు. డబ్బుకోసం నా ప్రాణాలకే నీళ్లు తోడుతూవున్న నువ్వు కక్కుర్తిలో ఆ పసివాడ్ని ఏమన్నా చెయ్యగలవు. నీ చేతుల్లో పెట్టె నిద్రపోవచ్చు ననుకున్నా దేవుడు మేలు చేశాడులే. అయిందేదో అయిపోయింది. ఈ రోజుతో మన స్నేహానికి అడ్డంగా యెర్రగీతలు పెడుతున్నా. దయచేసి అమర్యాద పొందకుండా నా ముందునుంచి శీఘ్రంగా వెళ్లిపో.—పో!' అంటూ కఠినంగా అని కోపంతో కందిపోయిన ముఖంతో లేచి నిలబడి గేటువేపు చెయ్యి చూపాడు.

డాక్టరు చలింపలేదు. హైటెంపరేచర్లోవున్న రోగి ఎన్ని సంధిప్రలాపాలన్నా పట్టించుకోవడం ఆవృత్తికే లేదు. సహజశాంతంతోనే అన్నాడు.

'థాంక్స్. మందు వాడకపోయినా, వ్యాధి కుదరకపోయినా, ఫీజుమాత్రం పేచీ పెట్టకుండా యిచ్చిన నీ మంచితనాన్ని మెచ్చుకుంటున్నా. పోతే నను గురించి నువ్వన్న మాటలు పట్టించుకునే బలహీనుడ్ని కాదు. ఏరోగి వైద్యుణ్ణి తిట్టకుండా వుంటాడు, చేదుమందును తలుచుకుని? మరి మందివ్వడమే నాదోషమంటావు సరే. నా చదువే అదాయె. ఇక ఫీజన్నావు? అది నా శ్రమఫలితం. నా చదువుకు మారకం. వాది నాకు ముట్టింది. నీమందు నీకిస్తున్నా నువ్వేంచేసుకున్నా సరే. నా వృత్తిధర్మం నేను పాటించాను. అంతకన్నా నాదోషం అణువంతకూడా లేదని భగవంతుడనేవాడుంటే అతనే అంగీకరిస్తాడు. అదే నాకు చాలు. ఇదిగో ప్రిస్క్రిప్షన్. ఇదుగో మందు. గుడ్ బై.' అంటూ వొక కాగితం వొకపాకెట్టూ టేబిల్ మీదపెట్టి వెనక్కి చూడకుండా విసురుగా వెళ్ళిపోయాడు డాక్టర్.

రాజారావు నీరసంగా కుర్చీలో కూలబడిపోయాడు. టేబిల్ మీదిపాకెట్ అతని బలహీనతకు నవ్వుతూవుంది. 'బాబూ అమ్మగారు పోయారా? మహాలక్ష్మిలాటి తల్లి!' అంటూ 'చివరి చూపన్నా అందుకోలేకపోయా దరిద్రుణ్ణి' అని అంగలార్చాడు తోటమాలి రాముడు. సెలవడిగి వూరికి వెళ్లి యిప్పుడే వచ్చాడు. పనిమనిషి చెబితే విన్నాడీ దుర్వార్త. పరామర్శించాడు.

రాజారావు వెరుగును సరళ అంటే యిరుగుపొరుగువారికే కాదు. నౌకర్లకూ చాకర్లకూ అందరికీ అభిమానమే. అటువంటి మహాలక్ష్మి తన్ను విడిచిపెట్టిపోయింది. ఇక తన జీవితం వ్యర్థం. పాపం అన్యాయంగా డాక్టర్ని నిందించాడు. అతడు నిర్దోషి. అప్పుడు తన నెన్నివిధాల మరణవాంఛ నుంచీ త్రిప్పాలని చూచాడు. తన బలవంతాన తప్పయినా అంగీకరించి మందు తెస్తే తా నీరోజున అవమానించి పంపాడు. అన్యాయం! అనుకున్నాడు. అతని ఆలోచనలు మలుపు తిరిగాయి. ఒకప్రక్క సరళ పైనించీ పిలుస్తూ వుంది. మరొకప్రక్క అందుబాటులోవున్న మామిడిపండులా తియ్యని వాసనలతో మనస్సు నూరిస్తూ వుంది సరోజిని సుందరమూర్తి. ఎంత దగా జరుగుతూవుంది సరళకు? మనస్సు కుట్రలో పడి మారుమార్గాన నడిచా డింతవరకూ. సరళ కన్యాయం చేసి తమ ప్రణయ జీవితానికి కళంకాన్ని ఆపాదించలేడు. సరోజినితో సాహచర్యం సరళ కన్యాయం చేసినట్టెలా అవుతుంది? ఆమెకు కాకపోతే ఆమె బిడ్డకు జరగవచ్చు. అయితే యీనాడు చనిపోతే మాత్రం తానా బిడ్డకు ఎలా న్యాయంచేయగలడు? డాక్టరు నవ్వుతాడు 'యీమాత్రం దానికే అనాడన్ని బింకాలు పలికావు ప్రేమనుగురించి' అని. లోకమంతా తన్ను చూసి అపహసిస్తూ వుంది. — అతని మెదడు ఆలోచనల్తో వుడుకెత్తిపోయింది. టేబిల్ మీది పాకెట్ నవ్వుతూ వుంది. ఏమైనా సరే తన జీవితానికిక స్వస్తిచెప్పాలి. వణుకుతూ వున్న చేతుల్తో దాన్నందుకున్నాడు. ప్రిస్క్రిప్షన్ స్లిప్పులో 'పాణిగ్రహణం' అని వుంది. రాజారావుకు ముచ్చెమట్లుపోశాయి. పాకెట్ విప్పాడు. రెండు రవ్వల వుంగరాలు ధగధగ మెరిసిపోతున్నాయి. ప్రక్కనే బిల్లు రూ. 125/- కు. ఆ బిల్లుకు గుచ్చిన చీటీలో 'కాబోయే వధూవరులకు కానుక' అని వ్రాసివుంది. రాజారావుకు కళ్లు చెమ్మగిల్లాయి.

ఆరాత్రి మెయిల్లో డాక్టరూ రాజారావూ తెనాలికి బయలుదేరారు అని చెప్పకుండా కథ ముగించడం యిష్టంలేదు.

★

రాజూ - పేద

వెల రు. 2-0-0

తపాల ఖర్చు ప్రత్యేకం.

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు.